


# రాళ్లలో బియ్యం

— విమలా రామం

బియ్యంలో రాళ్ళేరుతోంది విజయ!

బూట్లు టకటక లాడించుకుంటూ వచ్చాడు శ్రీధర్. ఆమెకు దగ్గరగా కుర్చీ ఈడ్చుక్కూర్చు న్నాడు. అతని చేతిలోని పూల పొట్లం పుచ్చు కున్నదే కాని ఆమె ముఖంలో అతనెదురుచూసిన పూవు పూయలేదు!

మంచినీళ్ళు తెచ్చిచ్చింది!

"అలిగితివ సఖీ!...." అని చేయి పట్టుకున్నాడు.

"సంగీతం తర్వాత కాని.... వెంటనే, మరెక్కడయినా ఇల్లు చూడండి. ఇక్కడ క్షణం కూడా ఉండలేను!" అంది విజయ రుసరుస లాడుతూ.

"శాంతించవే! విజయాంబికే!...."

"నాకు ప్రాణాలు పోతుంటే....మీకు పాటలు!"

"ఆగు మరి! ఒక క్షణం నన్నూపిరి సలుపు కోనీ!....ఇల్లు మార్చేయాలంటావ్! ఓకే! అలాగే! ఎక్కడికి మారుద్దాము?"

"ఈ పేటలో తప్ప ఇంకెక్కడికయినా సరే!"

"అంటే బాగోనిది ఈ పేటే కాని ఇల్లు కాదన్నమాట!"

"ఇదిగో కబుర్లలో పెట్టి మీరు మాట దాటేయటం నాకు క్రొత్తకాదు కాని....ఈమాటు నేను చాలా సీరియస్‌గా చెప్తున్నాను!"

"ఆల్‌రైట్! అర్థమయిపోయింది! నువ్వు చెప్పినట్టే చేద్దాం. అసలు ఇల్లు మార్చెయ్యటాని క్కారణం ఏమిటాని?"

తల దించుకుంటూ అంది విజయ "నాకిక్కడ ఉండాలని లేదు."

"నీకుండాలని లేనప్పుడు నేనూ ఉండను. కాని, ఎందుకూ అని!"

"ఏం చెప్పినా మీరు నవ్వుతారు. మీకు చెప్పటం నావల్లకాదు."

"ఈసారి నవ్వను. ఒట్టు!"

"ఏవో ఆడవాళ్ళ గొడవలు. మీకన్ని ఆరాలెందుకు."

"ఎందు కిల్లు మారారండీ అని ఎవరయినా అడిగితే నన్నిలాగే చెప్పమంటావా?"

"అన్నీ అందర్కీ చెప్పాలా?"

"అక్కర్లేదు. కనీసం, నువ్వు నీ బాధేమిటో నీ మొగుడికయినా చెప్పుకోవద్దా అని!"

విజయ మాట్లాడలేదు.

"ఇల్లు బాగోలేదని అనలేవు....నీ కిది నచ్చిందని ముందే చెప్పావు....మళ్ళీ ఇంత చక్కని వాటా దొరకాలంటే కష్టం!....సరే, సొంతింటి వాడికి ఒకే యిల్లు కాని — అద్దెకుండేవాడికి అన్నీ

ఇక్కే! ఎక్కడికెక్కావాలంటే అక్కడికి వెళ్ళచ్చు....ఎప్పుడు కావాలంటే అప్పుడు వెళ్ళచ్చు.... కాని, ఇది వదిలి పెట్టడానికి అసలు కారణం ఏమిటి? అది చెప్పు.''

''అర్థం చేసుకుంటే సరైన కారణమే అనుకుంటారు....లేకపోతే....''

''ప్రామిస్! అర్థం చేసుకుంటాను. చెప్పు.''

''ఇన్నాళ్ళు ఏదో ఒకటి మాట్లాడాలి కాబట్టి అలా అడుగుతోంటారు—అన్నారు మీరు. ఇవేళ పూర్తిగా అర్థమయిపోయింది నాకు. మన్ని అట పట్టించాలనే వాళ్ళలా అనేది....''

''ఎవరు? శేషమాంబా?''

''అవును. ఇవేళ ఆవిడొకత్తే రాలేదు. సావిత్రిని కూడా వెంటబెట్టుకు వచ్చింది. వచ్చీ రావడంతోటే....ఏదీ డైనింగు టేబిలు అని అడిగింది. తెల్లబోయాను. అరే నిన్న మీవారూ మీరూ ఫర్నీచరు షాపు దగ్గర చూస్తూంటే....కొనేసారనుకున్నాను. చూద్దామనే మేమొచ్చింది—అంటూ మొదలెట్టింది.''

''పోనీ, అనుకుందేమో! అనుకోవటంలో తప్పేముంది?....మనం వెళ్ళింది కూడా నిజమేగా!''

విజయ చురుక్కున చూసింది. ''ఈ కబుర్లు చెప్పకండి! కొంటే ఎదురుగుండా కనిపించేది కాదా? అల్మార్లోనో పెట్లోనో దాచుకునే వస్తువా అది! కొనలేదని ఇల్లు చెపుతోంది. ఇంక అడగటం ఎందుకు?....ఆc! మీరనేదేమిటో తెల్సు. కొనలేదు అని చెప్తే పోయేది. లేకపోతే కొంటాము ఎప్పుడో అని చెప్తే సరిపోతుంది—అంటారు మీరు. అదేమీ సరిపోదు వాళ్ళతో....మాట అనటానికి ఓ తీరూ తెన్నూ ఉంటాయి. కనిపిస్తే భయం. నోరు విప్పితే భయం. ఇవతల మనిషి ఎంత నొచ్చుకుంటుందో అన్న ఆలోచనయినా లేకుండా అడిగేస్తారు....మీ మగవాళ్ళ కవేం అర్థంకావు. గోరంతని కొండంత చేసుకుంటున్నామని అనుకుంటారు. కాని, ఆ మాటలు వినవల్సివస్తే తెలుస్తుంది!''

''అదేమిటి! నే నెప్పుడయినా అలా అన్నానా విజ్జీ!''

''మీరనకపోతే సరిపోదు. ఆ పైె బాధ తగ్గేలా చూడాలి.''

''మన పరిస్థితి....''

''మన పరిస్థితి నాకు తలుసు. నాకు తెలుసని మీకు తెలుసు. అది కొనలేదు ఇది కొనలేదు అని మనస్సులో కూడా నేననుకోను ....ఆ సంగతి కూడా మీకు తెలుసు. మనకు లేని వాటి గురించి నేను చెప్పటం లేదు. మనకు లేవని ఇంకొకళ్ళు చెప్పటమే....నేను భరించలేకుండా ఉన్నాను....మనకి ఫలానాది ఉండాలి అని మరొకళ్ళు చెప్పటమే బాధగా ఉంది!....''

తల దించుకున్న విజయ వైపు జాలిగా చూసాడు శ్రీధర్.

''నేను మీతో ఎన్నో విషయాలు చెప్పుకోవటం లేదు. కొన్ని కొన్ని చాలా సిల్లీగా ఉంటాయి. అందుకనే సర్దుకుపోతున్నాను – సరిపెట్టుకుంటున్నాను. కాని, అలా ఎంతకాలం? ఒకసారంటే ఏదో మాటవరసకి కావచ్చు. మరోసారంటే నిజంగా తెల్సుకుందామని అనుకోవచ్చు. కాని అదే పనిగా అంటుంటే?''

''ఒక్కొక్కళ్ళ తరహా అంతే! మనం పట్టించుకోకూడదు!''

''మీరు చెప్పినంత సులువు కాదది. వాళ్ళకి అనటం అలవాటేమో కాని నాకు పడటం అలవాటు లేదు.''

శ్రీధర్ నవ్వాడు.

''నవ్వకండి! అలా నవ్వితేనే నాకొళ్ళు మంట!''

''అదికాదు విజ్జీ! ఎవరయినా అనాలని అంటారా?''

''అదేమో నాకు తెలియదు. వాళ్ళనే పద్ధతి చూస్తే పనికట్టుకు అనదల్చుకున్నట్టే అనిపిస్తున్నది. నిన్నటికి నిన్న ఇంటికొచ్చి చూసినా తెల్లారి కనిపిస్తే చాలు ఏమయినా క్రొత్తవి కొన్నారా అని అడుగుతుంది. కొనలేదంటే ఒక బాధ....కొన్నామన్నానే అనుకోండి. ఏదీ చూపించమంటుంది. అక్కడ్నించి వంకలు. రేటెంతంటుంది. ఎక్కువిచ్చామంటుంది. అక్కడెక్కడో తక్కువ కిస్తున్నారంటుంది. చెప్పకపోయారా అంటుంది....చేతకాని వాళ్ళమన్నట్టు చూస్తుంది. ఇదింకో బాధ. శేషమాంబ పద్ధతి ఇలా ఉంటే ఇంక సావిత్రి పద్ధతి మరోటి....కృష్ణవేణి మిక్సీ కొన్న సంగతి చెపుతుంది. పార్వతి పట్టుచీర కొన్న సంగతి చెపుతుంది. దయామయి దబ్బనం కొన్న సంగతీ చెపుతుంది....''

శ్రీధర్ ఫక్కున నవ్వాడు.

విజయ చురచురా చూసింది. ''అవునండి! అవన్నీ నేనడిగానా? నాకెందుకు చెప్పటం? ఎవరి సంసారం వాళ్ళది. ఎవరి గొప్పలు వాళ్ళవి—ఎవరి బాధలు వాళ్ళవి. ఉంటే ఖర్చు పెట్టుకుంటారు. లేకపోతే, ఉన్నంతలో గడుపుకుంటారు....''

''నువ్వన్నది నిజమే విజ్జీ! కాని, కల్సినప్పుడల్లా మాట్లాడుకోటానికి ఏదో ఒక టాపిక్ అంటూ ఉండాలి కదా!....''

''....ఇలాంటివి తప్ప ఇంకేమీ దొరకవుటండీ వాళ్ళకి? అయినా అడగటానికి మాత్రం ఓ పద్ధతి అంటూ ఉండద్దా? ఉమాదేవి చూడండి. ఆవిడతో మాట్లాడుతుంటే ఎంతో హాయి అనిపిస్తుంది! ఆవిడ దగ్గర గంటయినా క్షణంలా గడుస్తుంది. మరి వీళ్లు....కనిపిస్తే భయం! తలుపు చప్పుడయితే చాలు గుండె దడ....''

శ్రీధర్ నవ్వునాపుకుంటూ అన్నాడు. ''సరే, ఆ ఉమాదేవి ఉండేదీ ఈ పేటలోనే!....''

''ఊc! మీరనేదేమిటో అర్థమయిందిలెండి! అయినా నాకిక్కడ ఉండాలనిలేదు. ఉండలేను.''

విజయ చేతులు తనలోకి తీసుకుంటూ అన్నాడు శ్రీధర్: ''పిచ్చిదానా! ఎవరో కొందరివల్ల కష్టం కలుగుతోందని మంచి వాళ్లున్న చోటుని వదులుకోవటం ఏం బావుంటుంది?''

''రావాలనుకున్నప్పుడు ఎంతదూరం నుంచయినా ఉమాదేవి కోసం రావచ్చు కాని....ఎదురెదురుగా ఉండి వీళ్ళతో భరించటం మాత్రం నావల్ల కాదు.''

''అంతగా తప్పదంటే అలాగే వెడదాము. కాని, ఒక్కటి చెప్పు....ఈ పేటకి రాకముందు ఇక్కడో శేషమాంబ ఉందని...మరో ఉమాదేవి ఉందని మనకి మాత్రం తెలుసా?''

''అంటే?''

''ఎక్కడికి వెళ్ళినా....ఏ పేటకి వెళ్ళినా చెడ్డవాళ్ళూ ఉంటారు. మంచి వాళ్ళూ ఉంటారు.... మనకు వాళ్ళూ వీళ్ళూ—అంతా తారసపడతారు. ఇదంతా మనం సర్దుకుపోవటాన్నిబట్టి ఉంటుంది!''

విజయ తెల్లబోయింది. ''ఇదా మీరు చివరకు తేల్చింది!''

''చూడు....ఈ బియ్యంలో రాళ్లు కూడా కలిసే ఉన్నాయి. మరి అన్నం వండుకునేటప్పుడు అవి తీసేస్తున్నావా లేదా? అలాగే....''

''ఊc! మీ ఉపమానాలకేం కాని....ఆ మాటకొస్తే బియ్యంకన్న రాళ్లే ఎక్కువ ఇక్కడ....''

శ్రీధర్ నిండుగా నవ్వాడు. ''అయితే బియ్యమే ఏరుకో! అదే సులువు కదా!'' ❁